క్లుప్తంగా

రేపు కపిలేశ్వరపురం మండల సమావేశం

కపిలేశ్వరపురం: స్థానిక మండల పరిషత్ సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ కె.రత్న కుమారి ఆదివారం తెలిపారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును ఆహ్వానించామన్నారు.

ఘనంగా స్వామివారి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని వైభవ వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక బృందం స్వామివారిని విశేషంగా అలంకరించారు. వేకువజాము 3 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శనివారం స్వామి దర్శన ప్రత్యేకత నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహక కమిటీ, దాతలు సౌజన్యంతో అన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఆంధ్రాబ్యాంకు వీధిలోకి మండపేట పోస్టాఫీసు

మండపేట: ప్రస్తుతం మెయిన్ రోడ్డులోని విజయమహల్ పక్కనే ఉన్న ప్రధాన తపాలా కార్యాలయం పట్టణంలోని ఆంధ్రాబ్యాంకు వీధిలోకి మారబోతోంది. రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ఉదయం 9 గంటలకు నూతన తపాలా కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారని పోస్టల్ ఉద్యోగి కొండపల్లి సూర్యనారాయణ తెలిపారు. ఖాతాదారులు, పోస్టల్ శాఖ అభిమానులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

70 మందికి కంటి పరీక్షలు



అగ్రహారంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అగ్రహారంలో రామచంద్రపురం పట్టణానికి చెందిన నేత్ర ప్రాథమిక కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ సీహెచ్ కుమార్, డాక్టర్ పి. సాయిలక్ష్మి 70 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో 30 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 10 మందిని శస్త్ర చికిత్సలకు రిఫర్ చేశారు. మిగిలిన రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు విత్తనాల వెంకటరమణ, కోటి ఏడుకొండలు, వీరెల్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అంబికపల్లి అగ్రహారం వద్ద ఆదివారం మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారు, ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కారు, ఆటో ఒకదానిని ఒకటి తప్పించుకునే క్రమంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కారు ముందు భాగం, ఆటో వెనుక భాగం రాసుకోవడంతో ఆటో తిరగబడింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తన కారులో బాధితులను ఆసుపత్రికి తరలించారు. దీనిపై తమకు ఎటువంటి సమాచారం లేదని రామచంద్రపురం పోలీసులు తెలిపారు.

అధికారుల ఫోన్ నంబర్లు

రాయవరం మండలం

తహసీల్దారు	: 9849903905
ఎంపీడీవో	: 9912191666
మండల విద్యాశాఖాధికారి1	: 9948523380
మండల విద్యాశాఖాధికారి2	: 7013074928
పోలీసు స్టేషన్	: 08857235333
సబ్ఇన్స్పెక్టరు	: 9440904843
రాయవరం పీహెచ్సీ వైద్యాధికారులు:	8309351543, 7013003149
మాచవరం పీహెచ్సీ వైద్యాధికారులు :	8501002004, 8639015670
మండల వ్యవసాయాధికారి	: 8886613579
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో	: 7702072648
డ్వాక్రా ఏపీఎం	: 9154081283
మండల ఇంజినీరింగ్ అధికారి	: 9502377535
విద్యుత్‌శాఖ ఏఈ	: 9440812651
హౌసింగ్ ఏఈ	: 7093930489
మండల పశువైద్యాధికారి	: 8074154935
ఉద్యానవన శాఖ అధికారి	: 8712625211
గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ	: 9100121182

అదృష్టం వరించేదెవరినో !

- మద్యం షాపులకు నేడు లాటరీ
- భారీగా పెరిగిన సిండికేట్లు
- సిట్టింగ్ రూముల కోసం అన్వేషణ
- రెండు నియోజకవర్గాల్లో 858 దరఖాస్తులు



రామచంద్రపురం ఎక్సైజ్ కార్యాలయం

రామచంద్రపురం: కూటమి ప్రభుత్వం చెప్పినట్టుగానే ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసింది. ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో నడిచే మద్యం దుకాణాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు అధికారులు ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేశారు. సర్కిల్ పరిధిలోని ఎక్సైజ్ స్టేషన్ల వద్ద సోమవారం మద్యం దుకాణాలకు ఆన్‌లైన్ డ్రాలను తీసే ఏర్పాట్లలో ఎక్సైజ్ అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పట్టణాల్లో సిట్టింగ్ రూముల కోసం సిండికేట్ లీడర్లు అన్వేషణను ప్రారంభించారు. పేరుకు ప్రైవేటు మద్యం దుకాణాలే తప్ప అమ్మకాలు, సిట్టింగ్ రూమ్‌లు, బెల్టు దుకాణాలు అన్ని కూటమి నేతల కనుసన్నల్లోనే సాగుతున్నాయి. దీంతో పాటుగా గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు పెంచుకునే దిశగా సిండికేట్ నాయకులు ముమ్మర ప్రయత్నాలను కొనసాగించారు. దీనిలో భాగంగానే రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఆదివారం మండలాల వారీగా సిండికేట్ సమావేశాలను నిర్వహించి మద్యం షాపుల ఏర్పాట్లకు సన్నహాలను ప్రారంభించారు.

భారీగా దరఖాస్తులు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే మద్యం షాపులకు భారీగానే దరఖాస్తులు వచ్చాయి. ప్రతి మండలంలోనూ ఒకరు ఇద్దరు కాకుండా పెద్ద పెద్ద సిండికేట్లుగా ఏర్పాటై మద్యం షాపులకు దరఖాస్తులు వేశారు. రామచంద్రపురం సర్కిల్ పరిధిలోని కె.గంగవరం మండలంలో 4 షాపులకు గాను మొత్తంగా 132, రామచంద్రపురం రూరల్‌లో 4 షాపులకు గాను 105, రామచంద్రపురం పట్టణంలో 6 షాపులకు 87, కాజులూరు మండలంలో 5 షాపులకు గాను 129 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మండపేట నియోజకవర్గంలో మండపేట పట్టణంలో 5 షాపులకు గాను 82, మండపేట రూరల్‌లో 06 షాపులకు గాను 123, కపిలేశ్వరపురం మండలంలో 4 షాపులకు గాను 83, రాయవరం మండలంలో 117 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా కె.గంగవరం మండలంలోని నాలుగు షాపులకు 132 దరఖాస్తులను దాఖలు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మొత్తం 453 దరఖాస్తులు దాఖలు చేయగా దరఖాస్తుకు రూ.2 లక్షలు చొప్పున మొత్తంగా రూ.9.6 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. మండపేట నియోజకవర్గంలో మొత్తం 405 దరఖాస్తులకు గాను రూ.2 లక్షలు చొప్పున మొత్తం రూ.8.10 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది.

ఈసారి మారిన సీను

గతంలో మాదిరిగా కాకుండా ఈసారి ఎక్సైజ్ పాలసీలో ప్రభుత్వం కొన్ని మార్పులను తీసుకువచ్చింది. గతంలో ఒక వ్యక్తి పేరుమీద ఒకే లైసెన్స్‌ను ఇచ్చి ఒకే షాపును కేటాయించారు. ఈసారి అలాకాకుండా ఒక వ్యక్తికి ఒకే లైసెన్స్‌మీద ఎన్ని షాపులకైనా వేసుకునే విధంగా మార్పులు తీసుకువచ్చారు. గతంలో ప్రతి మండలం, పట్టణాల్లో గ్రామాల వారీగా, కాలనీల వారీగా షాపులను కేటాయించేవారు. అయితే ఈసారి అలా కాకుండా మండలంలో 4 షాపులు ఉంటే ఏ గ్రామంలోనైనా షాపులను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రభుత్వం మార్పు చేసింది. ఉదాహరణకు కె.గంగవరం మండలంలో 26 గ్రామాలుండగా మొత్తంగా 4 షాపులకు టెండర్లు పిలిచారు. మండలంలోని 26 గ్రామాల్లో ఎక్కడైనా ఈ నాలుగు షాపులను పెట్టుకోవచ్చు. ఇలా కూటమి ప్రభుత్వం మార్పులు చేసి సిండికేట్లను అనుకూల పరిస్థితులను తీసుకు వచ్చిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మార్పుల కారణంగా ఏ గ్రూపునకు షాపు తగిలినా తిరిగి మళ్లీ సిండికేట్‌గా మారక తప్పని పరిస్థితులు ఉంటాయి. మండలంలోని నాలుగు లేదా ఐదు షాపులకు చెందిన వారంతా సిండికేట్ మారితే రేట్లు పెంచుకునే వెసులు బాటు ఉంటుందని అంచనా వేస్తున్నారు. సోమవారం సాయంత్రానికల్లా లాటరీ ప్రక్రియ ముగుయనున్న నేపథ్యంలో సిండికేట్లు షాపులను వెతికే పనిలో పడ్డారు.

మండపేటలో శ్రీకృష్ణుడి ఆలయం



ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ చేస్తున్న గోపాలకృష్ణ పద్మ దంపతులు

మండపేట: పట్టణ ప్రముఖుడు బిక్కిన చిన్న చేతుల మీదుగా మారేడుబాక పిల్ల కాలువ సమీప వీధిలో శ్రీకృష్ణుడి ఆలయాన్ని నిర్మించారు. బిక్కిన చిన్న తన సొంత సొమ్ముతో నిర్మించిన ఈ ఆలయానికి విజయదశమి నాడు ప్రారంభోత్సవం జరిగింది. దాత చిన్న కుమారుడు, బిక్కిన నర్సింగ్ హోమ్ అధినేత బిక్కిన గోపాలకృష్ణ, డాక్టర్ బిక్కిన పద్మ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాక ఆలయాన్ని ప్రారంభించారు. శనివారం తెల్లవారు జామున హోమం, యాగాలు నిర్వహించాక ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. ఆ పక్కనే విఘ్నేశ్వరుడు, ఆంజనేయ స్వామి వార్ల రాతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ సందర్భంగా నిర్మాణదాత బిక్కిన చిన్న మాట్లాడుతూ తన భార్య వెంకటరత్నం జ్ఞాపకార్థం ఈ ఆలయాన్ని నిర్మించానన్నారు. కార్యక్రమంలో చుట్టు పక్కల వీధుల్లోంచి ప్రజలు పెద్ద సంఖ్యంలో తరలి వచ్చి కృష్ణభగవానుడి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'తోరాటి' జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

అంగరలో లక్ష్మణమూర్తి 98వ జయంతి



అంగరలో తోరాటి స్మారక స్థూపం వద్ద ఎర్రబ్బులును సత్కరిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీర మరణం పొందిన అంగర గ్రామానికి చెందిన తోరాటి లక్ష్మణమూర్తి త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన 98వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. అంగరలోని ఆయన స్మారక స్థూపం వద్ద ఆదివారం పలు ప్రజాసంఘాల నాయకులు, గ్రామ ప్రముఖులు నివాళి అర్పించారు. చప్పిడిపాలెం వద్ద గల తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం, గాంధీ సెంటర్‌లోని ఆయన నిలువెత్తు విగ్రహం వద్ద సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ సంకాబత్తుల ఎర్రబ్బులును ఘనంగా సత్కరించారు. విజ్ఞాన కేంద్రం నిర్వాహక కమిటీ నాయకులు పెద్దింశెట్టి లక్ష్మణమూర్తి, అంగర, పడమర ఖండ్రిక పంచాయతీల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ యర్రా వీరన్న బాబు, పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ముత్తా అబ్బు, మేడేపల్లి కనక రామకృష్ణ, తిరునాతి వెంకటేశ్వరరావు, జిత్తుక మల్లికార్జునుడు, పసలపూడి కృష్ణ, యానాల సుబ్బారావు, పెద్దింశెట్టి వీరబాబు, ముత్తా త్రిమూర్తులు, చీకట్ల గంగరాజు, పడాల రాంబాబులు లక్ష్మణమూర్తి జీవితంలోని వీర ఘట్టాలను వివరించారు.

రాయవరంలో 'గౌర్రిపాటి ' జయంతి



గౌర్రిపాటి బుచ్చి అప్పారావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వెలమ సంఘం నేతలు

రాయవరం: స్వాతంత్ర్య సమరయోధుడు, తాడిపూడి రిజర్వాయర్ సృష్టికర్త గౌర్రిపాటి బుచ్చి అప్పారావు 111వ జయంతిని ఆదివారం రాయవరంలో నిర్వహించారు. స్థానిక వెలమ రామాలయం వద్ద అనపర్తి, మండపేట నియోజకవర్గాల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీను, గౌరవాధ్యక్షుడు సిరిపురపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బుచ్చి అప్పారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చి అప్పారావు సేవలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, వెలమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కామర్సి దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి లచ్చిరెడ్డి సత్యనారాయణ, కోశాధికారి దాకా మహేష్‌నాయుడు, వెలమ సంఘం నేతలు బొడ్డు ముత్యాలరావు, బెల్లపు లీలాలక్ష్మణరావు, కొల్లి అప్పారావు, సిరిపురపు భానుచందర్, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా ఏనుగుల సంబరం




గొల్లపాలెంలో శనివారం మధ్యాహ్నం బండిపై ఊరేగిస్తున్న చిన్న ఏనుగు



గొల్లపాలెం శనివారం రాత్రి ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న పెద్ద ఏనుగు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాజులూరు: నియోజకవర్గంలో ప్రసిద్ధిగాంచిన గొల్లపాలెంలో ఏనుగు సంబరం ఈ ఏడాది కన్నుల పండువగా జరిగింది. సుమారు 200 సంవత్సరాల నుంచి ఏటా విజయదశమికి ఎండు గడ్డి, తెల్లని వస్త్రం తదితర వస్తు సామగ్రితో తయారు చేసిన భారీ ఏనుగుల ప్రతిమలను ఊరేగించటం ఇక్కడ ఆనవాయితీ. విజయ దశమి రోజున గ్రామానికి చెందిన వెలమలు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ చిన్న ఏనుగును, కాపు, బలిజ కులస్తులు రాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ పెద్ద ఏనుగును ట్రాక్టరుపై గ్రామ వీధుల్లో ఊరేగిస్తుంటారు. దీనిలో భాగంగా శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ చిన్న ఏనుగును ఊరేగించారు. పెద్ద ఏనుగును శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ ట్రాక్టరుపై ఊరేగించారు. గరగ నృత్యాలు, కోల సంబరాలు, కోయ డ్యాన్సులు, గారడి, బ్యాండ్ మేళాల నడుమ ఏనుగుల సబరం కోలాహలంగా సాగింది. నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు కాకినాడ పట్టణం, రూరల్ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి సంబరాన్ని వీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



ద్రాక్షారామ ఏనుగుల సంబరంలో విద్యుద్దీపాలంకరణ

రామచంద్రపురం రూరల్: దసరా పండుగను పురస్కరించుకుని ఏటా ద్రాక్షారామలో నిర్వహించే ఏనుగుల సంబరం శనివారం రాత్రి కన్నుల పండువగా జగింది. గ్రామంలోని కర్రివారి వీధి, సాక్షివారి వీధి, వెలంపాలెం బుర్రా వీధుల్లో భారీ బొమ్మ ఏనుగులకు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించి బ్యాండ్ మేళాలు, కర్రసాములు, శక్తి వేషాలు, తీన్‌మార్ డాన్సుల ద్రాక్షారామ, వెలంపాలెం ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఏనుగుల సంబరంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ద్రాక్షారామ, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిలకలు చేతపట్టి.. పాటలు పాడుతూ..

పసలపూడి జెడ్పీ హైస్కూల్లో నాటి తరహా దసరా ఉత్సవాలు



విద్యార్థుల నవదుర్గల వేషధారణలతో గ్రామంలో ఆకట్టుకున్న ప్రదర్శన



ఉపాధ్యాయులకు విద్యార్థుల పాదపూజ

రాయవరం: నాటి దసరా సంప్రదాయలను గుర్తు చేసేలా పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ చింతా కృష్ణారెడ్డి పర్యవేక్షణలో హెచ్ఎం నూలు ఆదినారాయణ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గిలకలు చేతపట్టి, దసరా పాటలు పాడుతూ ఇంటింటికీ తిరిగారు. అలాగే విద్యార్థినులు వేసిన అమ్మవారి తొమ్మిది రూపాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. దసరా సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ విద్యార్థినుల నవదుర్గ వేషధారణలు, కోలాట నృత్యాలతో విద్యార్థులు చేసిన ప్రదర్శన అలనాటి దసరా ఉత్సవాలను గుర్తుకు తెచ్చాయి. తొలుతగా విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదపూజ నిర్వహించడం ద్వారా గురుపూజోత్సవాన్ని కూడా చేపట్టారు. ఉత్సవాల్లో గ్రామపెద్దలు కొవ్వూరి త్రినాధరెడ్డి, చైతన్య రాజబాబు, చింతా సుబ్బారెడ్డి, ప్రగతి రామారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, నల్లమిల్లి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీ నమోస్తుతే...

- విశేష అలంకరణలో దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ముగిసిన దసరా ఉత్సవాలు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాలు శనివారంతో అట్టహాసంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు కనకదుర్గ అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలోని 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. పండితులు అమ్మవారికి సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రజిత కవచంతో నిజ రూప అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్ తదితరులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

వైభవంగా నిమజ్జనోత్సవం

కాజులూరు: దేవీ నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. మండల పరిధిలోని గ్రామాల్లో పది రోజుల పాటు అమ్మవారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, హోమాలు, లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. నవరాత్రులు ముగియడంతో గరగ నృత్యలు, బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని ఊరేగించి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

విజయ దశమి ప్రాముఖ్యత గుర్తించాలి

రాయవరం: మంచి ఆలోచనలతో ప్రతి ఒక్కరూ సమాజ హితానికి పాటు పడాలని, ఇదే విషయాన్ని విజయదశమి పర్వదినం లోకానికి చాటి చెబుతుందని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా ఆయన పీఠానికి హాజరైన భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పురాణేతిహాస కాలాల నుంచి చెడుపై అంతిమ విజయం మంచికే దక్కుతుందన్నారు. విజయ దుర్గా అమ్మవారు విజయదశమి రోజు భక్తులకు రాజరాజేశ్వరి రూపంలో దర్శనమిచ్చారు. దసరా కావడంతో భక్తులతో పీఠం కిటకిటలాడింది. భక్తులకు ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై, శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి వారిని గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం, గారడీలు, మేళతాళాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ భక్తులు నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది.



ద్రాక్షారామలో రాజరాజేశ్వరీదేవిగా మాణిక్యాంబ అమ్మవారు



రజత కవచంతో నిజరూప అవతారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



ద్వారపూడిలో వాసవీ మాతకు 121 రకాల వంటకాలతో మహా నైవేద్యం



రాయవరం మండలం సోమేశ్వరంలో ప్రత్యేకాలంకరణలో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి



కాజులూరు ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు



వెదురుపాక విజయదుర్గా అమ్మవారి గ్రామోత్సవంలో భక్త జన సందోహం

ఆలయాల వద్ద వాహన పూజలు

ఈ నెల 3న ప్రారంభమైన శరన్నవరాత్ర దసరా ఉత్సవాలు శనివారం విజయ దశమి పర్వదినంతో ముగిశాయి. విజయదశమి సందర్భంగా శనివారం అమ్మవారిని పలు చోట్ల నయనానందకరంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నూతన వాహనాలు కొనుగోలు చేసిన వారు ఆలయాల వద్ద వాహన పూజలు, కార్మికులు ఆయుధ పూజలు చేశారు.

కోర్కెల చీటీలు కట్టిన భక్తులు

సాయంత్రం సమయంలో పలువురు భక్తులు జమ్మి చెట్టు వద్దకు వెళ్లి కోరిన కోర్కెలు తీర్చాలంటూ జమ్మి చెట్టుకు చీటీలు కట్టారు. వివిధ వర్గాల వారు శమీ పూజ నిర్వహించారు. పలు ఆలయాల్లో అమ్మవారిని రాజరాజేశ్వరి రూపంలో అలంకరించారు.

ఘనంగా నిమజ్జనాలు

శరన్నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో వివిధ గ్రామాల్లో ఆలయాల వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. మేళతాళాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమలు భక్తులను అలరించాయి.

ద్వారపూడిలో ..

మండపేట: మండలంలోని ద్వారపూడిలో వాసవీ మాత నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఈ వేడుకలు జరిగాయి. దసరారోజున వాసవీ యూత్ కమిటీ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. 121 రకాల పిండి వంటలు, పండ్లను వాసవీమాతకు మహా నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు, గ్రామస్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



రాయవరంలో ప్రత్యేక అలంకరణలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామి